క్లుప్తంగా

ముగిసిన జాతర

నారాయణఖేడ్: మండల పరిధిలోని హన్మంత్‌రావుపేట్‌లో నిర్వహించిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీల్లో స్థానిక మల్లయోధులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. చివరి కుస్తీ పోటీల్లో విజయం సాధించిన మహారాష్ట్రకు చెందిన మల్లయోధుడు అభిజిత్ కలిగావ్‌కు నిర్వాహకులు ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ దత్తు, ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్య, మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఎంపీటీసీ నారాయణ, నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని ప్రభుత్వ రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాలతో పాటు కోహీర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ దండు అంజయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఎస్‌ఏ–21 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఖదీర్, కీర్తన, సీఆర్పీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్‌కు వేతనం అందజేత



హెచ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యావలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతికి స్థానిక నాయకులు సాయిగౌడ్, గణేష్‌లు ఏడాదికి సరిపడా వేతనాన్ని శనివారం అందజేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం లక్ష్మిని యువజన సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని నీలం మధు కార్యాలయంలో మెదక్ పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల, స్వచ్ఛంద సంస్థలు నీలం మధుకు మద్దతు తెలుపుతూ ఘనంగా సన్మానించారు.

వాహనవేగ పరిమితి బోర్డును మార్చండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీ నుంచి రింగ్ రోడ్డుకు వెళ్లే రేడియల్ రోడ్డు నెంబర్ 7పై వాహనాల వేగాన్ని పెంచుతూ బోర్డును ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంద్రానగర్ నుంచి రింగ్‌రోడ్డుకు వెళ్లే రేడియల్ రోడ్డుపై ట్రాఫిక్ పోలీసు అధికారులు వాహనాల వేగ పరిమితి 60 స్పీడ్ అని బోర్డు పెట్టి చలాన్లు విధిస్తున్నారన్నారు. నింబంధనల ప్రకారం ఈరోడ్డుపై 100 వేగంతో వెళ్లవచ్చన్నారు. కనీసం 80 స్పీడ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే లోకసభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరులో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశానికి ఆ పార్టీ శ్రేణులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ లోకసభ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు ఐలేశ్‌యాదవ్, కృష్ణకాంత్, పరమేశ్‌యాదవ్, యాదయ్య, విజయ్‌కుమార్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

కానరాని పచ్చదనం..
కరువైన ఆహ్లాదం

అభివృద్ధికి నోచుకోని పార్కులు ● దెబ్బతిన్న ఆట వస్తువులు
మందుబాబులకు అడ్డాలుగా పార్కులు ● అధికారుల పర్యవేక్షణ కరువు



హౌసింగ్ బోర్డు పార్కులో ఎండిపోతున్న చెట్లు

జిల్లాలోనే జహీరాబాద్ పెద్ద మున్సిపాలిటిగా ఉంది. ఆహ్లాదం కోసం పట్టణంలో హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీలో పార్కులను ఏర్పాటు చేశారు. కానీ.. అధికారులు పర్యవేక్షణ లేక హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు అధ్వాన్నంగా తయారైంది. హౌసింగ్‌బోర్డు పరిధిలోని శాంతినగర్, వెంకటరమణనగర్, నారాయణనగర్, ఐడీఎస్‌ఎంటీ కాలనీలన కలిపి పదహారేళ్ల క్రితం హౌసింగ్ బోర్డు కాలనీలోని విశాలమైన స్థలం పార్కును ఏర్పాటు చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. మధ్యలో వాకింగ్‌ట్రాక్ కూడా ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. మధ్యలో పచ్చిగడ్డి పరిచి క్రమం తప్పకుండా నీళ్లు పెట్టడంతో అప్పట్లో పార్క్‌లో ఆహ్లాదం కనిపించేది. కానీ.. నేడు అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కులు కళావిహీనంగా మారాయి.

వినియోగానికి నోచుకోని బోరుమోటారు

పార్కుల్లోని మొక్కలకు నీరు పెట్టేందుకు ఏర్పాటు చేసిన బోరుమోటారు మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో మొక్కలు, చెట్లు, గడ్డికి నీళ్లు లేక ఎండిపోతున్నాయి. ప్రహరీ కూలుతోంది. పార్కుకు ప్రజలు రావడం మానేయడంతో పిల్లలకు ఆటస్థలాలుగా మారాయి. రాత్రి సమయంలో మందుబాబులకు ఆవాసంగా మారాయి. ఈ పార్కుల అభివృద్ధి కోసం ఆరేళ్ల క్రితం రూ.50లక్షలు మంజూరు కాగా కాంట్రాక్టర్ వాచ్‌మెన్ రూం, తదితర పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి.

జహీరాబాద్ పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. పార్కుల పట్ల నిర్లక్ష్యం నీడలు అలుముకున్నాయి. పర్యవేక్షణ కరువై పచ్చదనం కనుమరుగైంది. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన పార్కులు నేడు వెలవెలబోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కరువడంతో పార్కుల్లోని చెట్లు, మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఆహ్లాదం పంచాల్సిన పార్కులు పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలాలుగా మారాయి. ఆయా పార్కుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. – జహీరాబాద్ టౌన్

పార్కుల అభివృద్ధికి చర్యలు

“ ఇటీవలే మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించా. పట్టణంలోని పార్కుల అభివృద్ధికి త్వరలోనే చర్యలు తీసుకుంటాం. హౌసింగ్ బోర్డు పార్కులో నిలిచిపోయిన పనులపై సమీక్ష నిర్వహిస్తాం. అసంపూర్తి పనులను పూర్తి చేసేవిధంగా దృష్టి సారిస్తాం. పార్కు స్థలాలు కబ్జాకాకుండా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్



అసంపూర్తిగా నిలిచిన వాచ్‌మెన్ రూం పనులు



క్రీడాస్థలాన్ని తలపిస్తున్న పార్కు

దెబ్బతిన్న ఆటవస్తువులు

పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలోని పార్కులోని పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు చాలావరకు దెబ్బతిన్నాయి. కాగా పట్టణంలో ఆయా కాలనీలలో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి హౌసింగ్ బోర్డు, ఎన్‌జీవోస్ పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు కబ్జాలకు గురవుతున్న పార్కు స్థలాలను పరిరక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద బీమా కల్పించండి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఉపాధి హామీ కూలీలకు రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎల్లారం గ్రామంలో పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించి రూ.800 దినసరి కూలి ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ పథకంలో అనేక మార్పులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, చాంద్, పాష, అనంతి, లక్ష్మి, శ్రీనివాస్, జనార్ధన్, పోచయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

జహీరాబాద్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలని ఉత్సవాల కమిటీ కన్వీనర్ రాంచందర్ భీంవంశీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ భవనం, పస్తాపూర్ పరిధిలోని బైపాస్ వద్ద ఉన్న అంబేడ్కర్ భవనం వద్ద జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రధాన రహదారి, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలల సమర్పణ, సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు అంబేడ్కర్ చౌక్ వద్ద బహిరంగసభ ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు పట్టణంలో భీం సందేశ్ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

మిల్లెట్ ప్రాసెస్ యూనిట్ సందర్శన



మిల్లెట్ ప్రాసెస్ యూనిట్‌ను సందర్శిస్తున్న మహిళా గ్రూపు సభ్యులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని లింగాపూర్ శివారులో రూర్బన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెస్ యూనిట్‌ను మెదక్ జిల్లా టేక్మాల్, వెల్దుర్తి మండలాలకు చెందిన 40మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లెట్ ప్రాసెస్ యూనిట్‌లో మహిళలు చిరు ధాన్యాలతో చేస్తున్న వంటకాలు, వాల్యూఆడెడ్ విధానంతో పాటు పంటల వైవిధ్య కరణ పద్ధతులపై అవగాహన కల్పించారు. మిల్లెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ వీర్‌శెట్టి, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్ ప్రాసెసింగ్ యూనిట్‌లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా మహిళా రైతులు చిరుధాన్యాలతో చేస్తున్న జొన్నరొట్టెలు, ఇతర ఆహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో మొగులయ్య, ఎఫ్‌పీవో చైర్మన్ రాంకిరణ్, చాందిని, చరిష్మ, డాక్టర్లు సంగప్ప, శ్రీనివాసబాబు, రఫీ పాల్గొన్నారు.



వైభవంగా బీరప్ప బోనాలు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామంలో బీరప్ప విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం బీరప్ప బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు బోనమెత్తి ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సంగారెడ్డి అర్బన్: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ కలిసి ప్రారంభించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి, అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌కు సహకరించండి

జహీరాబాద్: పోలీసులు చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌కు ప్రజలు సహకరించాలని జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనర్లు మోటారు సైకిళ్లను ఇవ్వకూడదని, ఇచ్చిన ఎడల తల్లిదండ్రులపై 304–ఐఐ ఐపీసీ కింద కేసు నమోదు చేస్తామన్నారు. నంబరు ప్లేట్ లేని మోటారుసైకిల్ రోడ్లపై నడపితే సీజ్ చేస్తామని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ చేసి ఓటీపీ అడిగినట్లయితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దని సూచించారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు



పరమేశ్వరి

పటాన్‌చెరు టౌన్: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అనిల్‌కుమార్ 3నెలల క్రితం బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లికి కుటుంబసభ్యులతో వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న అనిల్‌కుమార్ ఎప్పటిలాగే కూలి పనికి వెళ్లాడు. అదేరోజు అనిల్‌కుమార్ భార్య పరమేశ్వరి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళి తిరిగిరాలేదు. దీంతో భార్య ఆచూకీ కోసం అనిల్‌కుమార్ ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య అదృశ్యంపై శనివారం అమీన్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగదు పట్టివేత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెళ్లి చెక్ పోస్టు వద్ద శనివారం చేపట్టిన తనిఖీలో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.50 లక్షల నగదు పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. కర్నాటక నుంచి కారులో తీసుకొస్తున్న డబ్బును సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.

రోడ్డు పనులు పూర్తయ్యేనా?

- గుంతలమయంగా మారిన రహదారి
- రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

డబుల్ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ.. ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రోడ్డు వేసేందుకు ఇరువైపులా గుంతలు తీయటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పనులను పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

మండల కేంద్రమైన గుమ్మడిదల గ్రామం నుంచి అనంతారం మీదుగా కానుకుంట గ్రామం వరకు డబుల్ రోడ్డు పనులు చేపట్టేందుకు రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.9కోట్ల నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు వేసేందుకు ఇరువైపులా గుంతలు తీసి వదిలేశారు. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పనులను పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న రోడ్డు

పనులు పూర్తి చేయించేలా చర్యలు

గుమ్మడిదల నుంచి కానుకుంట వరకు డబుల్ రోడ్డు నిర్మించేందుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కృషి చేశారు. కానీ.. కొన్ని కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే సహకారంతో అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేయించి మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం.

– కుమార్‌గౌడ్, జెడ్పీటీసీ, గుమ్మడిదల

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



రక్తదానం చేస్తున్న యువతి

నారాయణఖేడ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వివిధ గ్రామాలకు చెందిన యవకులు, ప్రజాసంఘాల నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు కొటారి నర్సింహులు, బ్లడ్ డోనర్స్ గ్రూపు వ్యవస్థాపకులు ముజాహెద్ చిస్తి, ఓంప్రకాష్, అంబేడ్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు కాన్షీరాం, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, ఆయా సంఘాల నాయకులు ఆనంద్, చిరంజీవి, అశోక్, సంజీవులు, రాజ్‌కుమార్, అశోక్, దేవదాస్, పుండరీకం, బంగార్రాజు, వీణకుమారి, సత్తమ్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిన్నారానికి చెందిన రాజిరెడ్డి నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని శనివారం బీజేపీ జిల్లా నాయకులు రాజిరెడ్డికి అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ ప్రజల శ్రేయస్సే బీజేపీ లక్ష్యం

పటాన్‌చెరు టౌన్: ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని పిలుపునిచ్చారు.

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో...

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో బీజేపీ నాయకులు శాంతినగర్‌తో పాటు పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంపీ బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్‌స్వామి, ఉపాధ్యక్షురాలు అర్చనసారడా, కార్యదర్శి శోభారాణి, జిల్లా నాయకులు అరుణ కౌశాస్, శ్రీనివాస్‌గుప్తా, బక్కయ్య గుప్తా, నాయకులు శ్రవణ్, సంతోష్ పాల్గొన్నారు.

◆ బహిరంగసభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలోచలో చేవెళ్ల బహిరంగ సభకు తరలివెళ్లారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, రవిందర్‌రావు, నాగమణి, భాస్కర్, తిలావత్, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ బైక్‌ర్యాలీతో తరలిన నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): మెదక్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ యువత ఆత్మీయ సమ్మేళనానికి సదాశివపేట పట్టణం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, యువకులు భారీ బైక్‌ర్యాలీతో తరలివెళ్లారు. పట్టణ యువ నాయకులు సోమశేఖర్‌యాదవ్, పట్టణ మైనార్టీ సేల్ అధ్యక్షుడు ఖామీల్ పాల్గొన్నారు.

◆ బీజేపీలో చేరిక

సదాశివపేట(సంగారెడ్డి): మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్ పురాన్‌సంగ్ బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంయాదవ్, శ్రీకాంత్‌రాజ్, కృష్ణగౌడ్, నర్సింహాగౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

మొగుడంపల్లి మండలంలో..

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు శనివారం బీజేపీలో చేరారు. పడియాల్‌తండాకు చెందిన మధు చౌవాన్, లేతమామిడి తండాకు చెందిన వార్డు సభ్యులు రాథోడ్ మోహన్, రాజు రాథోడ్, నరేందర్, అజయ్, రవీందర్, ప్రకాష్, నారాయణ, నాందేవ్, రవి, సుభాష్‌లు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, జిల్లా సహాయ కోశాధికారి శ్రీనివాస్‌గుప్తా, విజయమోహన్‌రెడ్డి, శ్రీకాంత్, సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

◆ హోరాహోరీగా కుస్తీపోటీలు



కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని బాన్సువాడ బారడి పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం కుస్తీపోటీలు హోరాహోరీగా జరిగాయి. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి పైల్‌వాన్‌లు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన పైల్‌వాన్‌లకు నగదు బహుమానంతో పాటు చివరికుస్తీలో గెలిచిన వారికి 5 తులాల వెండి కడియం బహూకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ ముమ్మరంగా ఓటరు నమోదు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్ పేటలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ సేవా భారతి ఆధ్వర్యంలో శనివారం ఓటరు నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్, చంద్రశేఖర్, ఉమాకాంత్, సాయికార్తీక్ పాల్గొన్నారు.

◆ బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ లోకసభ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం బీజేవైఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లడ్డు యాదవ్, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌యాదవ్, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నరేష్ పాటిల్, నాయకులు అనిల్, సంతోష్, అఖిలేష్, వంశీ, వినోద్, రాము, సుభాష్, రవి, వాసు పాల్గొన్నారు.

◆ మద్దతు ఇవ్వండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ స్వతంత్ర కౌన్సిలర్ భరత్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకులు కొల్లూరి సత్తయ్యను శనివారం రాత్రి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు కలసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ భరత్ మాట్లాడుతూ నీలం మధు ముదిరాజ్‌కు సంపూర్ణ మద్దతిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బాబుగౌడ్, మధు, రుద్రారం వెంకన్న, శ్రీశైలం, పాండు, భిక్షపతి, రాజేష్‌గౌడ్, దిలీప్ పాల్గొన్నారు.

◆ న్యూరాలజిస్ట్, కార్డియాలజిస్టులను నియమించాలి

సంగారెడ్డి: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరాలజిస్ట్ కార్డియాలజిస్టలను నియమించాలని బహుజన సేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దప్పు రాజు డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో దప్పు రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నరాలకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు, న్యూరాలజిస్టు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గుండెకు సంబంధించిన డాక్టర్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్టులకు సేవలందించే విభాగంలో నురాలాజిస్ట్, ల్యాబ్ పరీక్షలు వైద్యులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యూరోలజిస్ట్, కార్డియాలజిస్టలను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆనంద్ కుమార్, రాములు, సామెల్ తదితరులు పాల్గొన్నారు.